


# సుబ్బారావు పెళ్ళిచూపులు

భళ్ళమూడి నాగరాజు

"ఒరే అబ్బిగా డబ్బులు ఎక్కువ పట్టుకుని వెళ్ళకు. సరిపడా పట్టుకో. బండి ఆగిన ప్రతీ స్టేషన్‌లోనూ దిగి కాఫీలు, టీలు తాగకు. ఇక పెళ్ళిచూపుల్లో అమ్మాయి నచ్చిందనుకో, వెంకటాపురం కుక్కలాగా నాలిక చాచి చొంగలు కార్చుకుంటూ నచ్చింది అని చెప్పేసి గంగిరెద్దులాగా తలూపకు. ఇక్కడో బామ్మొందన్న సంగతి మరిచిపోకు. ఇంటికి వెళ్ళి మా బామ్మతో చెప్పి ఉత్తరం రాయిస్తానని చెప్పు అర్థమైందా? వాళ్ళింటిలో భోజనం చెయ్యకు. మన రామం ఇంటికి వెళ్ళి, వాడ్ని, వాడి పెళ్ళాన్ని పెళ్ళిచూపులకు తీసుకుని వెళ్ళు. ఆ రామిగాడి పెళ్ళానికి ముందే చెప్పు, పెళ్ళిచూపుల్లో నంగిరిపింగిరి ప్రశ్నలు వేయొద్దని". ఉదయం నుంచి బామ్మ ఇదే మోస్తరు. చెప్పిందే చెప్పి, నా బుర్ర తినేస్తోంది.

ఈ రోజు నాకు చాలా ఆనందంగా ఉంది. మనస్సు దూదిపింజెలా ఎగిరిపోతోంది. ఆనందంతో గెంతులు వెయ్యాలన్నంత హేపీగా ఉంది. వీలైనంత త్వరగా వెళ్ళి ఆ పిల్లని చూసేసి, పెళ్ళి చేసుకుని "ఈ సుబ్బారావు కూడా ఓ ఇంటివాడు అయ్యాడు" అనిపించుకోవాలని వుంది. దువ్విన తలనే మరోసారి దువ్వుకుంటుండగా మళ్ళా వచ్చింది బామ్మ.

"ఒరే అబ్బాయ్! రిజర్వేషన్ చేయించుకొని డబ్బులు అనవసరంగా కాల్చుకోకు. కోరాపుట్ నుంచి రాయగడ వచ్చే బోగీలు అన్నీ ఖాళీగా వుంటాయట. ఆ బోగీలో ఎక్కి హాయిగా పడుకో. బరంపురం రాగానే నిన్ను లేపమని ఎవరికైనా చెప్పి పడుకో. బరంపురంలో జాగర్తగా దిగు. వినబడుతున్నాయా నా మాటలు" అంటూ బామ్మ చెవిలో ఇల్లు కట్టుకుని మరీ పోరుతున్నది. "ఇక లాభంలేదు. ఇంట్లో వుంటే ఇలాగే బుర్ర తినేస్తుంది" అనుకుని బయటకు వచ్చేశాను బామ్మ ఆశీస్సులు తీసుకుని.

పున్నమి రాత్రులు శశికాంతులతో ఆహ్లాదకరంగా వుంది రేయి. మనస్సంతా ఆనందంతో నిండి వుంది. మదిలోని ఊహలు నన్ను రోడ్డుమీద తిన్నగా నడవనివ్వడంలేదు. గెంతుతూ, పరుగులు తీస్తూ వెళ్ళాలి అనిపిస్తోంది. క్షణాలలో స్టేషన్‌కి చేరిపోయాను. కోరాపుట్ నుంచి రాయగడ వచ్చి భువనేశ్వర్ వెళ్ళవలసిన బండి ఇంకా రాలేదు. ఒక మేగజైన్ కొనుక్కుని వచ్చి ఓ కుర్చీలో కూర్చున్నా. నా ఊహలు అన్నీ రేపు బరంపురంలో జరగబోయే పెళ్ళిచూపుల మీదనే... ఇంతలో ట్రెయిన్ వచ్చింది.

టిక్కెట్ తీయడానికి కౌంటర్ దగ్గరకు వెళ్ళి జేబులో చెయ్యి పెట్టేసరికి నా గుండె ఝల్లుమంది. జేబులో పరుసు లేదు. మేగజైన్ కొన్నప్పుడు వుంది. "ఏంటి ఇలా జరిగింది?" అయినా బామ్మ సోదే నన్ను తినేసింది అని బామ్మ మీద కోపం వచ్చింది. ఇప్పుడెలా? ఇంటికి వెళ్ళి రావడానికి టైమ్ సరిపోదు. అయినా బామ్మకి ఈ విషయం తెలిస్తే పెద్ద గొడవ చేసి పెళ్ళిచూపులకి వెళ్ళవద్దు అంటుంది. ఎలా?... అని అటూ ఇటూ చూసేసరికి మా ఆఫీసులో పనిచేస్తున్న రమాకాంత్ పండా కనిపించేసరికి నాకు ధైర్యం వచ్చి అతని దగ్గరికి గబగబా వెళ్ళి జరిగిందంతా చెప్పి డబ్బు సర్దమన్నాను. నా మాట కాదనలేక ఓ నాలుగు వందలు ఇచ్చి పుణ్యం

కట్టుకున్నాడు. అతనికి కృతజ్ఞతలు చెప్పి, టిక్కెట్ తీసుకుని బండి ఎక్కి కూర్చున్నాను. అప్పటికే నాకు నిద్ర ముంచుకువస్తోంది. రూర్కెలా నుంచి బండి వచ్చి దీనికి బోగీలు కలిపితేగాని బండి కదలదు. అటూ ఇటూ చూసి ఎవరికైనా చెప్పి పడుకుందాం అనుకున్నాను. నా ఎదురుగా ఓ జంట కూర్చున్నారు. కొత్తగా పెళ్ళి అయినట్లుంది. పరవాలేదు. జంట చూడముచ్చటగా ఉన్నారు. వాళ్ళకి ఎలాగూ నిద్రరాదు, బరంపురం రాగానే లేపమంటే సరి అనుకుని "ఏ ఊరు వెళతారు" అని అడిగాను. "బరంపురం" అన్నాడు ఆ యువకుడు. ఓ.కె. అనుకుని "బరంపురం వచ్చే ముందు నన్ను కొద్దిగా లేపండి" అని వారికి రిక్వెస్టు చేసి రేపు చూడబోయే పెళ్ళికూతుర్ని ఊహించుకుంటూ నిద్రలోకి జారుకున్నాను.

* * *

కళ్ళు మత్తుగా బరువుగా ఉన్నాయి. తెలివి రావడంతో టైమ్ చూసుకున్నాను. మూడున్నర అయింది. గుండెలో రాయి పడ్డట్టయింది. సాధారణంగా మూడు గంటలకే బరంపురం చేరిపోతుంది. కొంపతీసి బరంపురం దాటిపోయింది కాబోలు అనుకుంటూ నా ఎదుటనున్న సీటువైపు చూస్తే ఆ జంట లేరు. గబగబా బండి దిగి ప్లాట్‌ఫారం మీదకి వచ్చి అక్కడే నిలబడ్డ ఓ అరవై ఏళ్ళతనిని అడిగాను "ఏ ఊరిది?" అని. రాయగడ అన్నాడతను.

ఆఁ .... అని ఒక్కసారి నోరు తెరిచి చుట్టూ చూశాను. అదే స్టేషన్, అదే ఊరు. అదే బుక్‌స్టాల్. 'హతోస్మి' అనుకుని, "ఏమండీ బండి ఇంకా కదల్లేదు" అన్నాను అనుమానంగా. రూర్కెలా నుంచి రావలసిన హీరాఖండ్ ఎక్స్‌ప్రెస్ ఇంజన్ ఫెయిల్ అయిందట. ఇక్కడి నుంచి ఇంజన్ వెళ్ళింది. మరో అరగంటలో రావచ్చు అంటున్నారు" అన్నాడతను విసుక్కోకుండా ప్రశాంతంగా.

నా మనస్సులో చిన్న అనుమానం తొంగిచూసింది. ప్రయాణం అయ్యేసరికి పరుసుతో పాటు ఆరొందలు గాయబ్. పోనీ... బండి ఎక్కి వెళదామా అనుకుంటే "ఎక్కడ వేసిన గొంగళి అక్కడే" అన్నట్లు ఇంకా ఇక్కడే ఉన్నాను. బయల్దేరిన ముహూర్తం బాగోలేదు కాబోలు అనుకుని బుర్రంతా పిచ్చి ఎక్కినట్లు అయి ఓ వేడి టీ తాగితేగాని తేరుకోలేకపోయాను. ఈలోగా వచ్చింది ట్రెయిన్. నిద్ర మత్తుతోనే జనాలు దిగుతున్నారు, ఎక్కుతున్నారు. నేనూ ఎక్కి నా సీట్‌లో కూర్చున్నాను. రూర్కెలా నుంచి వచ్చిన బోగీలను మా బండికి కలిపాక మెల్లగా కదిలింది ట్రెయిన్.

* * *

రామం అన్నయ్య ఇంటికి వెళ్ళి, అన్నయ్య వదినతో సహా ముగ్గురం బయలుదేరాం పెళ్ళిచూపులకి. ఆడపిల్ల తండ్రి మా కోసమే ఎదురుచూస్తూ, గబగబా వచ్చి గ్లాడ్‌గా రిసీవ్ చేసుకున్నాడు.

ఇల్లు చాలా బాగుంది. ఇంటిని చూసి ఇల్లాలిని చూడాలన్నారు పెద్దలు. ఖరీదైన సోఫాలు, కలర్ టి.వీ. ఎక్కడ వుండవలసినవి అక్కడ నీట్‌గా ఉండడంతో చాలా బాగుంది ఇల్లు. ఒక ఆవిడ వచ్చి స్వీట్, హాట్ మా ముందు ఉంచి వెళ్ళింది. నాకైతే పిల్లని చూడాలని మహా తొందరగా ఉంది. నా అవస్థని గమనించి, మా అన్నయ్య చెప్పడంతో పిల్లని తీసుకునివచ్చి నాకు ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చోపెట్టారు. ఆమెను చూసేసరికి నాకు మతిపోయినంత పనైంది. అమ్మాయి సూపర్. చాలా బాగుంది. గుండ్రని ముఖం, చిన్న ఎర్రని పెదాలు, పెద్ద కళ్ళు, పచ్చని పసిమి రంగు, టోటల్‌గా పిల్ల చాలా చాలా బాగుంది.


వదిన అడిగిన ఒకటి రెండు ప్రశ్నలకి జవాబులిస్తూనే నన్ను ఓ కంట చూస్తూనే ఉంది. ఈ అమ్మాయిని వదులుకోకూడదు. వెంటనే 'నచ్చింది' అని చెప్పకపోతే చేజేతులారా జారిపోతుంది అనుకుని "నాకు అమ్మాయి నచ్చింది" అని చెప్పేద్దాం అనుకుని బామ్మ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చి ఆగిపోయాను.

వీధిలోంచి పిల్ల తాలూకు పినతండ్రి అప్పుడే లోపలికి వస్తూ నన్ను చూస్తూనే నొసలు చిట్లించి "మీది రాయగడ కదూ!" అన్నాడు. "అవును" అన్నాను జవాబుగా. అంటే అతను ఓ గదిలోకి వెళ్ళి వాళ్ళ అన్నయ్యని, వదినని రమ్మనడంతో అంతా పిల్లని తీసుకొనిమరీ లోపలికి వెళ్ళిపోయారు. వాళ్ళలో వాళ్ళు ఏవో గుసగుసలు. ఆ గుసగుసలు ఎందుకో నాకు అర్థంకాలేదు. "అలాగా... అయితే మనకీ సంబంధం వద్దు" అన్న మాటలు నా చెవిలో పడ్డాయి. ఆ మాటలు విన్నంతనే నా గుండెల్లో రాయి పడింది. ఏ మచ్చా లేని తెల్లకాగితం లాంటి వాడిని నా మీద వీళ్ళకి అనుమానం ఏంటి? అని నాలో నేనే అనుకుంటుండగా వాళ్ళంతా బయటకువచ్చి "అయ్యా రామంగారూ! వీరు మీ తమ్ముడన్నారు!" అన్నాడు పెళ్ళిపెద్ద.

"ఆఁ... అదే మా పెద్దమ్మ కొడుకు" అన్నాడు అన్నయ్య. మరి మనం బ్రాహ్మణులం కదా! మీ తమ్ముడ్ని అంతా " 'చేపల సుబ్బారావ్' అంటారని మా వాడు అంటున్నాడు" అన్నాడు పెళ్ళిపెద్ద ఏ అనుమానం దాచుకోకుండా.

"ఓ... అదా మీ సందేహం. మా వాడు ఫిషరీ డిపార్టుమెంటులో స్టెనోగా పనిచేస్తున్నాడు. అందుచేత కొంతమంది ఆకతాయి కుర్రాళ్ళు అలా పిలుస్తారు అంతే" అన్నాడు అన్నయ్య. కానీ వాళ్ళలో అనుమానం పొరలు తొలగిపోలేదు. అలా అయితే ఇంత చక్కని అమ్మాయి అనవసరంగా పోతోంది. ఎలాగైనా అమ్మాయితో మాట్లాడి ఇలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని చెప్పి నచ్చచెప్పాలని ఆలోచన రాగానే "పెళ్ళికూతురితో ఓ పది నిముషాలు మాట్లాడవచ్చా" అని అన్నాను.

"వద్దు బాబూ. భగవంతుడి దయ వలన



మీకు, మాకు అన్ని విధాల కలిసి, ఈ సంబంధం కుదిరిపోతే పది నిముషాలేం ఖర్మ, రోజుల తరబడి మాట్లాడుకోవచ్చు" అని మెల్లగా చురక అంటించాడు పెళ్ళికూతురి పినతండ్రి. మధ్యలో వచ్చి అంతా పాడుచేసాడని అతనిని చూస్తే నాకు ఒళ్ళుమంట పుట్టుకొచ్చి నాలుగు దులిపేయాలనుకున్నాను. "ఇంటికి వెళ్ళి ఉత్తరం రాస్తాం" అని చెప్పి అక్కడి నుండి బయలుదేరాం.

* * *

"బామ్మా! పెళ్ళికూతురు చాలా బాగుందే. బంగారు బొమ్మలా ఉంది. ఆ రంగు, రూపం అచ్చు రంభే అనుకో" అంటూ ఉత్సాహంతో బామ్మకి చెప్పేసరికి బామ్మ కూడా ఆనందంతో మొహం వికసించి 'సరే' అని వెంటనే ఉత్తరం రాయిస్తుంది అనుకున్నాను. కానీ,

"ఒరే అబ్బీ... ఈ సంబంధం మనకి వద్దురా!" అని బామ్మ అనే సరికి నా బుర్రమీద పిడుగు పడ్డట్టయి "ఏం... ఎంచేతనే వద్దు" అని గట్టిగా కేకేశాను. "భార్య గుణవతి అయి వుండాలి గానీ, రూపవతి అయితే అనేక అనర్థాలు వస్తాయిరా. మనకి సంసారపక్షంగా వుండి ఇంటిపట్టున వుండే అమ్మాయి కావాలిగాని అందగత్తెలు, సొగసరి భామలు కాదురా... అందందేముంది? బుజ్జిముండ మన పెరట్లో ఆవుదూడ అందంగా లేదు!... అలాగని దానిని కట్టుకుంటామా ఏంటి? ఇవాళే మాకీ సంబంధం వద్దు అని ఆ కృష్ణమూర్తిగారికి ఉత్తరం రాయిస్తా" అని అంది.

బామ్మ మాటలకి తల తిరిగినట్లయి, తేరుకొని "అది కాదే బామ్మా. అందగత్తె అంటే.... మరీ అందగత్తేం కాదు. చూడముచ్చటగా వుంది... అంతే. అయినా నాకు తెలీక అడుగుతాను, రూపవతిని కాక ఎవరైనా అనాకారిని పెళ్ళి చూసుకుంటారా ఏంటి?" అన్నాను ధైర్యంగా.

"అది కాదురా!" అంటూ ఇంకా ఏదో చెప్పబోయింది. "బామ్మా. నువ్వేన్ని చెప్పు. నేను ఆ పిల్లని తప్ప మరొకర్ని చేసుకోను" అని చెప్పేసరికి "సరే నీకంత ఇష్టం అయితే నేనెందుకు కాదనాలి? ఈ రోజే ఉత్తరం రాయిస్తాలే" అంది బామ్మ.

* * *

వారం, పది, ఇరవై ... ఇలా నెలరోజులు గడిచిపోయాయి. వాళ్ళదగ్గర నుంచి ఏ విధమైన సమాచారం లేదు. "మావాడికి మీ అమ్మాయి నచ్చింది. వెంటనే వస్తే మిగతా విషయాలు మాట్లాడుకోవచ్చు" అని బామ్మ రాయించిన ఉత్తరానికి కనీసం జవాబు కూడా లేదు. నా మనస్సంతా వికలమై, అన్నయ్యకి ఉత్తరం రాశాను. వారం రోజులకి సమాధానం వచ్చింది. ఆ ఉత్తరం చదువుతుంటే కళ్ళు చీకట్లు కమ్మాయి.

"తమ్ముడికి ఆశీస్సులు. నీవు ఆ రోజు ఇంటికి వెళ్ళిన వెంటనే శ్రీకృష్ణమూర్తి గారికి ఉత్తరం రాయిస్తానని చెప్పావు. కానీ ఈ రోజు దాకా వారికి నీ నుంచి ఉత్తరం రాకపోవడంతో వారు నిరుత్సాహపడ్డారు. ఆ అమ్మాయికి నువ్వు బాగా నచ్చావట. నీకు నిజంగా ఆ అమ్మాయిని చేసుకోవాలని ఉంటే వెంటనే రావలెను. నీ దగ్గర నుంచి ఉత్తరం లేదని వారు వేరే సంబంధం వెతికే ప్రయత్నంలో ఉన్నారు. అందువలన ఇక ఉత్తరాలతో కాలయాపన చెయ్యవద్దు. నీ రాక కోసం ఎదురుచూస్తూ..."

అన్నయ్య
రామం.

అన్నయ్య రాసిన ఉత్తరం చదువుతుంటే కళ్ళు తిరిగినట్లయి "ఎందుచేత వారికి ఉత్తరం అందలేదు? బామ్మ ఆ రోజు వెంటనే ఉత్తరం రాయించిందే! నేనే అడ్రస్ రాశాను కూడా. పోస్టల్ మిస్ అయ్యిందా?" ఇలా ఆలోచిస్తూ బుర్ర వేడెక్కింది. ఆలోచనలకు తెరదించి బరంపురం వెళ్ళడానికి నిశ్చయించుకుని ఆఫీసు నుంచి ఇంటికి చేరుకునేసరికి తాళంవేసి వుంది. ప్రక్కింటివాళ్ళను అడిగేసరికి "మీ బామ్మ కోవెలకి వెళ్ళారు" అంటూ తాళంచెవి అందించారు.

బామ్మ రాగానే చెప్పి బయలుదేరుదామని తయారవుతూ డబ్బులు చూసుకున్నాను. పరుసులో వందే వుంది. బామ్మ దగ్గర ఉంటాయేమోనని బామ్మ ట్రంకుపెట్టెలో డబ్బుల డబ్బా వెదుకుదామని పెట్టె తెరిచాను. పెట్టె తెరిచీ తెరవగానే ఎప్పుడూ కనబడే డబ్బా కనబడలేదు. చీరలన్నీ ఒకటీ, ఒకటీ తీసి క్రింద పడేశాను. పెట్టెలో అడుగున డబ్బా కనిపించింది. డబ్బా తెరుద్దాం అనుకునేలోగా టక్... టక్... మని తలుపు చప్పుడు. బామ్మ వచ్చింది కాబోలు అనుకుని బయటకు వెళ్ళేసరికి "ధర్మం బాబయ్యా" అంటూ ముష్టివాడు. కోపంతో వాడ్ని నాలుగు దులిపి గదిలోకి వచ్చి డబ్బులడబ్బా తెరిచేసరికి, నా కళ్ళు తిరిగినంత పని అయింది. నా చేతిరాతతో అడ్రసు రాసిన ఉత్తరం వెక్కిరించినట్లు రెపరెపలాడింది. "బామ్మ ఈ ఉత్తరం పోస్టు చేయలేదన్న మాట". 'ఎంత పని చేశావే బామ్మా' అనుకొని బామ్మ పెట్టెలోనున్న ఆరు వందలూ జేబులో నొక్కేసి, చీరలన్నీ పెట్టెలో కుక్కేసి, వీధి తలుపుకి బావురుకప్పంత తాళం వేసి, చెల్ మోహనరంగా... చెల్ చెల్ మోహనరంగా .... అంటూ పాడుకుంటూ స్టేషన్‌కి చేరుకున్నాను. మొదటిసారి డబ్బులు పోవడం అనుభవం అయింది కదా! ఈసారి జాగర్తగా వాటిని దాచుకుని టిక్కెట్ కొనుక్కుని ప్లాట్‌ఫారం మీదకి వచ్చే సరికి బండి వచ్చింది. హుషారుగా ఈల వేసుకుంటూ బండి ఎక్కి కూర్చున్నాక, కొద్ది క్షణాలలో బండి కదిలి స్పీడ్ అందుకుంది. అప్పుడు గుర్తుకు వచ్చింది సుబ్బారావ్‌కి తాళంచెవులు ప్రక్క ఇంటిలో ఇవ్వలేదని. అదే సమయంలో బామ్మ కోవెల నుంచి వచ్చే సరికి తాళంకప్ప మారి బావురుకప్పంత వుండడంతో చిందులు తొక్కుతుంటే, బండిలో ఈలపాట పాడుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు సుబ్బారావ్. ❋

